


# అనుక్షణం

## - సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

### (గతసంచిక తరువాయి)

"**బాగుంది. నీ ప్రశ్నలకి** నేను సమాధానం చెబుతాను. ఇప్పుడు కాదు. అయితే నువ్వు అన్నదాంట్లో ఒక నిజం వుంది. మాలాంటి వాళ్లం కొంతమంది, అందరూ అనను. భావుకత్వంలో బతకటం నిజమే. మీలాంటి వారు మాకంటే భిన్నంగా వుంటారు. అంటే కాస్త రియాలిటీ. ఏం జరిగినా అది ప్రేమయినా, మరొకటయినా వాస్తవికంగా ఆలోచించే ప్రయత్నం చేస్తారు. అది పైకి కనిపించేది అని మేం అంటాం. లోపల ఇంకేదో వుంది. అది తెలుసుకోవాలి అని వాదిస్తాం. మీకు సిద్ధాంతాల్తో పని లేదు. మేం కూడా పైకి కనిపించే దానికంటే కనిపించని దాని కోసం వెతుకుతాం. ఆ రకంగా మన అభిప్రాయాలు క్లాష్ అవుతుంటాయి" అన్నాడు శివ.

వెంకటాద్రికి మళ్లీ ఏదో అర్థం కాలేదు.

ఆఫీస్ లో కూడా ఒకరిద్దరు శివలాంటి వారు వుండేవారు. అప్పుడప్పుడు కొన్ని పుస్తకాలు యిచ్చి చదవమని బలవంతం చేసేవారు. తప్పక అలా కొన్ని చదివాడు. అందులో అన్నీ విపరీతమైన ఆదర్శాలు. అవి జరిగితే ఎంత బాగుంటుందో. లోకంలో జరగని వాటి గురించి రాసిన వారున్నారు. అప్పుడే వాళ్లతో గట్టిగా వాదించాలనుకున్నాడు. మనకెందుకు ఈ తల నొప్పి. బాగుందంటే పోయే. ఒక్క మాటతో సరిపోతుంది. ఎందుకు బాగుందని ఎవరూ అడగరు. అప్పటి నుండి వాటిని ఇస్తానన్నా ముఖం మీద చెప్పాడు.

"ఇవి చదివే వారికి ఇస్తే మంచిది. నాకు ఇవి అర్థం కావు. నా ప్రపంచంలోకి మీరు రారు. మీ ప్రపంచంలోకి నేను రాను" అని. వాళ్లూ బలవంతం చేయటం మానేశారు.

ఇద్దరూ వెనక్కి తిరిగారు. ఎవరూ మాట్లాడుకోవటం లేదు. వెంకటాద్రి తన గురించి ఆలోచించుకుంటున్నాడు. తనలో ఏదో తేడా వుంది అనిపిస్తోంది. అసలు ఈ డబ్బు దొరకకుండా వుంటే తనలో ఇన్ని ఆలోచనలు లేవు. అత్యంత సాధారణంగా బతుకు గడిచిపోయేది. ఇప్పుడు ఆ డబ్బుని ఎవరికో ఇవ్వటానికి మనస్కరించటం లేదు. ఇక్కడ నైతిక

విలువల ప్రసక్తి రావటం లేదు. ఆ డబ్బుని చెలామణిలోకి తేవటమే అసలు సమస్య. ఈ మాత్రం చేయలేకపోతే తాను చేతకాని మనిషిగా మిగులుతాడు.

ఈ రోజుల్లో అలాంటి మనుషులు ఆదర్శం కాదు అనుకున్నాడు.

వారం రోజుల్లో మళ్లీ బెంగళూరు ప్రయాణం పడింది. ఈసారి నిరంజన్ రావటం లేదు. తను మాత్రం వెళ్లాలి. ఫ్లయిట్ లో కాదు. రైల్లో టిక్కెట్లు బుక్ చేశారు. థర్డ్ ఏ.సి. అలాగే ఇంతకు ముందు దిగినంత పెద్ద హోటల్ లో కాకుండా రూమ్ బుక్ చేశారు. అక్కడ ఆఫీస్ కి ఓ మంచి ఏరియాలో, ఓ కాంప్లెక్స్ చూశారు. అది చూసి ఫైనలైజ్ చేయాలి.

నిరంజన్ కి ఇప్పటికే ఆ ప్రాంతం గురించి తెలుసు. ఫోటోలు తీసి పంపించారు. కాకపోతే లీజ్ విషయంలో బేరం చేయాలి. ఆ విషయం కూడా మాట్లాడాడు. బాస్ ఫైనలైజ్ చేస్తారని చెప్పాలి. అవసరాన్ని బట్టి నిరంజన్ వస్తాడు. ఎగ్రిమెంట్ మీద సైన్ చేస్తాడు. అప్పటికప్పుడు ఫర్నిచర్ ని తెప్పించటం జరుగుతుంది. ఇప్పుడు తను చేయవలసిన పని ఇంకోటి వుంది. ఆఫీస్ కి దగ్గర్లో అపార్ట్ మెంట్ తీసుకోవాలి. వెళ్లిన ప్రతిసారీ హోటల్లో స్టే చేయటం ఇక నుండి అనవసరం.

అప్పుడు మొదటి సారి కళ్యాణి ఇంట్లో లేనప్పుడు ఆ సూట్ కేసు తెరిచాడు. అందులో నుండి పాతిక నోట్లు బయటకు తీయటం జరిగింది. మళ్లీ సూట్ కేసుని అక్కడే వుంచాడు.

అలా డబ్బుకి కదలిక వచ్చింది.

బెంగళూరులో దిగాక అనుకున్నట్లే హోటల్ రూమ్ లో దిగాడు. అక్కడ ఓ సూపర్ వైజర్ ని పెట్టారు. అతను వచ్చాడు. అక్కడ నుండి పనులు మొదలు అయ్యాయి. ముందు ఆఫీస్ స్పేస్ ని చూశారు. ఆ సెంటర్ బాగుంది. లంచ్ లోగానే వారితో చర్చలు మొదలు అయ్యాయి. మా బాస్ కి బ్రీఫ్ చేస్తాను అన్నాడు.

ఇప్పుడు పోర్షన్ కోసం చూడటం. ఈ స్పేస్ కాక మరో ఆఫీస్ స్పేస్ చూశాం అన్నాడు రాజ్ కుమార్. అది కూడా చూద్దాం అనుకున్నారు. అక్కడ కూడా వీడియోలు తీసి నిరంజన్ కి పంపించారు. అందులో ఏది ఫైనలైజ్ అవుతుందో తెలియదు. దాన్ని బట్టి ఇంటి పోర్షన్ ని చూడవచ్చు.

బెంగళూరులో ట్రాఫిక్ సమస్య బాగా వుంది. అక్కడ చెట్లను ఎలా బడితే అలా నరికేయటానికి ఒప్పుకోరు అంటారు. రోడ్ల విస్తరణకు అదీ ఓ సమస్యని చెప్పుకుంటారు. నిరంజన్ బిజీగా వున్నాడు. అందుకని సాయంకాలం ఓ బట్టల షోరూమ్ కి వెళ్లాడు. ఇప్పటి వరకు తను బట్టల గురించి పట్టించుకోలేదు. అత్యంత మామూలుగా వుండేవాడు. మూడు నాలుగు సంవత్సరాల కోసారి నాలుగయిదు జతలు తీసుకునేవాడు. తమ ఆఫీస్ లో రోజుకో డ్రెస్ వేసేవారు, రకరకాల హెయిర్ స్టైల్స్ తో ప్రత్యేకంగా కనిపించటానికి తాపత్రయ పడేవారున్నారు.

అలాంటి వారు వెంకటాద్రిని చూసి నవ్వుకునేవారు. ఇంతకు ముందు తన బట్టల్ని కళ్యాణి సెలక్ట్ చేసేది. పిల్లలకి, ఆమెకి బట్టల విషయంలోనే కాదు ఏది తీసుకోవాలన్నా కళ్యాణే. ఈ హోమ్ ఫ్రంట్ నాది అన్నట్లు వుంటుంది. కూరగాయల నుండి ఏదయినా తన పాత్ర లేకుంటే తృప్తిపడదు.

అలాంటిది మొదటిసారి తన బట్టలు తాను తీసుకుంటున్నాడు. ఎందుకయినా మంచిదని మామూలు నోట్లు కూడా తీసుకు వచ్చాడు. కౌంటర్ దగ్గర ఒక వేళ రెండు వేల నోటు నకిలీదంటే ఏం మాట్లాడాలో ప్రాక్టీస్ చేసుకున్నాడు. ఏ.టి.ఎమ్. నుండి డ్రా చేశాను. నేను కంప్లయింట్ ఇస్తాను అని అది వాపస్ తీసుకోవటం కాదంటే వాళ్ల ముందు చింపేయాలని నిర్ణయం తీసుకున్నాడు.

అసలు సమస్య ఇప్పుడుంది. తనలో వున్న కంగారును ముఖంలో ఏ మాత్రం కనిపించనీయకూడదు. నటించాలి. చిన్నప్పుడు వెంకటాద్రికి కూడా నటించాలని వుండేది. అది యవ్వనంలోనూ అప్పుడప్పుడు కవ్వించేది. నువ్వు అంత అందగాడివి కాదు అని మనసులో అనుకునేవాడు. అందానికి నిర్వచనం ఇప్పటికీ వెంకటాద్రికి తెలియదు. అదో బ్రహ్మ పదార్థం ప్రేమలానే! అని అతని అభిప్రాయం.

ఇప్పుడలా కాదు. జీవితంలో నటించాలి. ఎప్పటి నుంచో జీన్స్ ఫ్యాంట్ కొనుక్కోవాలని వుంది. అదేంటో ఇన్ ఫీరియారిటీ. ఎవరేమనుకుంటారో అనే ఫీలింగ్. ఇప్పుడు అలాంటివన్నీ తొలగించుకునే సమయం వచ్చింది. రెండు జతలు ఎన్నిక చేసుకున్నాడు. అందులో ఒక జీన్స్ ఫ్యాంట్. ఓ డిజైనర్ షర్ట్. అలాగే గళ్ళది. ఇంతకు ముందు తెల్లటి బట్టలు ఎప్పుడయినా లైట్ కలర్స్. మీకు ఇవే బాగుంటాయి అనేది కళ్యాణి.

కౌంటర్ దగ్గరికి నడిచాడు. ఎంత మామూలుగా వుందామన్నా లోపల మాత్రం టెంక్షన్ వుంది. నాలుగు రెండు వేల నోట్లు అందించాడు. కౌంటర్ లో వున్న వ్యక్తి ప్రతి నోటునీ కాస్త ఎడంగా పెట్టి చూస్తున్నాడు. ఆ సమయం, ఆ క్షణాలు తన జీవితంలో ఎప్పటికీ గుర్తుంటాయి.

మొదటిసారి కెమెరా ముందు నిలబడి దర్శకుడితో తిట్లు తిన్న నటుడిలా వుంది పరిస్థితి. అతనా నోట్లను కౌంటర్ లో వేసి ఛేంజ్ యిచ్చాడు.

ప్రపంచాన్ని జయించినంత సంతోషం. గాల్లోకి లేచి 'హుర్రే' అని అరవాలనే కోరికను బలవంతంగా అణుచుకున్నాడు. ఇంకేం చేయాలనిపించలేదు. ఎక్కడికీ వెళ్లాలనిపించలేదు. సరాసరి గదికి వెళ్లాడు. ఆ ప్యాకెట్ ని పక్కన పడేశాడు. అప్పుడు గుర్తు వచ్చింది. ముందుగా తిరుమల వెళ్లి అక్కడ నుండి ఈ డబ్బుని కానుకతో మొదలు పెట్టాలనుకున్న విషయం.

కొత్త వలువలు వచ్చాయి. విలువలు పోవటం కూడా మొదలయింది అని ఎవరో అంటున్నట్లు అనిపించింది. ఇందులో విలువల సమస్య ఏముంది! ఆనందరావుకి కలిసి వచ్చింది. తనకూ అంతే. స్వామికి ఇప్పటికీ పాతనోట్లని సమర్పించే

భక్తులున్నారని వార్తలు చదివాడు. ఇప్పుడు తను వడ్డికాసులవాడికి ఎలాంటి అపరాధ భావన లేకుండా మొక్కు తీర్చుకుంటాడు.

అవును. లంకెల బిందెలు మనుషుల్లోకి అప్పుడప్పుడు ఓ ప్రవాహంలా వస్తుంటాయి. దాని అర్థం వాటిని జనానికి పంచమని కాదు. ముందు ఆ సంపదని తలకు ఎక్కించకూడదు. అప్పుడు దీప్తి గుర్తు వచ్చింది. ఫోన్ చేశాడు.

"అమ్మాయి ఇప్పుడు వచ్చి నిన్ను చూడటానికి అవకాశం వుంటుందా?" అని అడిగాడు. తను కనుక్కుని చెబుతాను అంది. ముందు ఫోన్ కలిసింది. అయిదు నిముషాల తర్వాత దీప్తి మాట్లాడింది.

"నాన్నా... మాగ్జిమమ్ పావు గంట పర్మిషన్ యిచ్చారు. మా నాన్న అర్జెంట్ గా పని మీద వచ్చారు హైదరాబాద్ నుండి అని రిక్వెస్ట్ చేశాను. మేమ్ ఒప్పుకున్నారు. మీరు రావటానికి ఎంత సేపు పడుతుంది!"

"కారులో వస్తాను. ట్రాఫిక్ ని బట్టి వుంటుంది".

"వెంటనే బయలు దేరండి" అంది.

కిందకు వచ్చాడు. దగ్గరే స్వీట్ స్టాల్ కనిపించింది. ఓ కిలో డ్రైఫ్రూట్ స్వీట్ ప్యాక్ చేయించాడు. అక్కడా రెండు వేల నోటు యిచ్చాడు. ఇప్పుడు ఎలాంటి కంగారు లేదు. త్వరగానే అక్కడికి చేరుకున్నాడు. ఇంతకు ముందు దీప్తిని కలుసుకున్నారు – జాయిన్ చేయటానికి వచ్చినప్పుడు కాక ఇంకోసారి. తను మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చేస్తోంది.

అయితే పావుగంట అంటే కాస్త బాధగా అనిపించింది. జైల్లో వున్న ఖైదీలను చూడటానికి ఇంటి వారు వెళ్తుంటారు. చాలా దూరం నుండి కష్టపడి వెళ్లినా పది నిముషాలు పర్మిషన్ ఇవ్వరు. ఇదీ అలానే వుంది. అదనేముంది. స్వామి దర్శనానికి వెళ్లినా అంతే కదా!

ముందు స్వీట్ బాక్స్ ఓపెన్ చేసి ఓ స్వీట్ అందించాడు.

"ఎందుకు నాన్నా ఇంత ఖరీదు పెట్టి తీసుకు వచ్చారు. నేను రూమ్ లో తింటాను".

"నా ముందు తినరా" అన్నాడు.

అందులో సగం తుంచి వెంకటాద్రికి పెట్టింది. అప్పుడు తన కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆడపిల్లల ప్రేమలు వేరు అనుకున్నాడు.

"వాటర్ తీసుకు వస్తాను నాన్నా" అంది దీప్తి.

"వద్దు. అయిదు నిముషాలు వేస్ట్ అవుతాయి. నేను మళ్లీ మళ్లీ వస్తుంటాను. ఎలా చదువుతున్నావు?"

"అమ్మ ఎలా వుంది నాన్నా?"

"బాగుంది. ఈ మధ్య రాత్రి పూట ఒంటరిగా వుండాల్సి వస్తోంది – నేను ఇక్కడికి వచ్చినప్పుడు".

"అలవాటు చేసుకోవాలి నాన్నా... అయినా పక్కన ఇళ్లున్నాయి. భయం ఏముంది. మనింట్లో పడి దోచుకోవటానికేం లేవుగా".

ఉలిక్కిపడ్డాడు.

"మన లాంటి కుటుంబాలకు చిన్న దొంగతనం కూడా పెద్దదే అవుతుంది. నేను ఉద్యోగంలో చేరగానే అనుకున్నాను. నా జీవితం సెటిల్ అయిపోయింది. నాకు భూమి వుంది. జీతం వస్తుంది. ఇంకేంటి అని. మీ నాయనమ్మా వాళ్లు బతికినంత కాలం అద్దె ఇంటిలో వున్నారు. ఎప్పటికయినా ఓ ఇల్లు కొనాలి అని మాత్రం అనుకున్నాను. చదువుల ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పటి దాకా మా ఇద్దరి ఆరోగ్యాలు బాగున్నాయి కాబట్టి సరిపోయింది. లేకపోతే పరిస్థితి ఏంటి?"

"మరీ అంత భయపడాల్సిన పరిస్థితి కాదులే నాన్నా!"

"అలా అనకు దీప్తీ. రాను రానూ జీవితం చాలా కష్టంగా మారుతుంది. మధ్య తరగతి మనుషులు బతకటం కష్టం అవుతుంది".

"మామూలు స్వీట్లు తీసుకురావచ్చు. ఇవి అవసరమా?"

"ఎప్పుడన్నా ఓ సారి కదా!"

"నాన్నా... మీరు అవన్నీ దాటి ముందుకు వచ్చారు. అన్నయ్య మూడు నాలుగు సంవత్సరాల్లో మీ చేతికి వస్తాడు. మీరు నా పెళ్లి గురించి మాట్లాడతారు. నేను చదువు పూర్తి చేసి జాబ్ లో చేరిన రెండు సంవత్సరాల దాకా దాని గురించి ఆలోచించను. నేను మీకు బర్డెన్ కాను".

"అలా అని నేను అన్నానా? అది మా బాధ్యత".

"అందుకే చెబుతున్నాను. మా గురించి మీరు ఎక్కువ ఆలోచించవద్దు. మీరు ఎంజాయ్ చేయండి. చూడాలనుకున్న ప్రాంతాలు చూడండి. మీ చిన్న చిన్న కోరికలు తీర్చుకోండి. ఇప్పటి వరకు మా కోసం బతికారు. ఇప్పుడు మీ కోసం మీరు బతకండి" అంది నవ్వుతూ.

"ఈ రోజు పెళ్లి ఖర్చులు ఎంతవుతున్నాయో నీకు తెలుసు. అయినా మీ చదువులు పూర్తి కావటానికి పొలం అమ్మకుండా, అప్పులు చేయకుండా వుంటే అది గొప్ప".

"అదే చెబుతున్నాను. పొలం అమ్మే ఆలోచన రానీయకండి. అప్పులు చేయాల్సిన అవసరం రాదనుకుంటున్నాను. మీకు వచ్చిన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ తో జాగ్రత్తగా ప్లాన్ చేస్తారని నాకు తెలుసు. నా చదువుకి అయ్యే ప్రతి రూపాయి నేను మీకు 'పే' చేస్తాను."

"పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడకు. చూస్తుంటే మీ ఆస్తి కూడా వద్దు. అసలు నేను పెళ్లి చేసుకోను అనేలా వున్నావు?"

"నేను పెళ్లి చేసుకోను అనను నాన్నా. పెద్ద కట్నాలు అవీ ఇవీ అంటే నాకు ఇష్టం వుండదు. అసలు మా నాన్న అమ్మా ఏదో ఇస్తారని నేను ఎందుకనుకోవాలి. నేను సంపాదిస్తాను".

''వచ్చే వారు ఒప్పుకోరులే. అయినా ఆడపిల్లలు ఎవరూ పుట్టింటి నుండి వచ్చే ఆస్తిని కాదనుకోరు. కొంత మందయితే వీలయినంత ఎక్కువ లాగటానికి ప్రయత్నం చేస్తారు'' అన్నాడు వెంకటాద్రి.

''ఇప్పుడు ఆడపిల్లలు మారుతున్నారు. అయినా ముందు మీరు కష్టపడి సంపాదించింది మీరు అనుభవించాలి. ఇదీ నా మనసులోని మాట'' అంది.

''సరే టైం అయినట్లుంది''.

''అన్నయ్యని కలవటం కుదరదుగా?''

''లేదు లేదు.. ''

''మరి నేను వుంటాను. బై నాన్నా'' అంది దీప్తి.

హోటల్ గదికి వచ్చాడు.

ఆదిత్య–దీప్తిలతో మాట్లాడాక వెంకటాద్రికి తృప్తిగా అనిపించింది. ముఖ్యంగా దీప్తి నాకు మీ ఆస్తి అవసరం లేదు అంది. నేను సంపాదిస్తానంటోంది. అప్పుడు మాత్రం కాస్త యిబ్బందిగా అనిపించింది. ఇప్పుడు తను సంపాదించిన ఏభై లక్షలు వున్నాయి. ఆ విషయం చెబితే తను ఎలా రియాక్టవుతుందో?.

ఏమైనా బతుకులో ఎప్పుడూ ఇలాంటివి కాకపోయినా నైతికతకి, వాస్తవానికి మధ్య ఘర్షణ నడుస్తూనే వుంటుంది. అతను టీ.వీ. ఆన్ చేయగానే ఆ ఛానల్ లో పెద్ద చర్చ నడుస్తోంది.

''నా కథను ఆ రచయిత కాపీ కొట్టాడు. ఆ రకంగా నా భవిష్యత్తు మీద దెబ్బ కొట్టాడు. ఇప్పుడు నాకు న్యాయం జరగాలి ఇందుకు సినిమా వారు కల్పించుకోవాలి'' ఇదీ అతని వాదం.

''నా కథకి ఆధారం పత్రికలో వచ్చిన ఓ కథనం. ఇది వాస్తవికంగా జరిగింది. అలాంటి అంశం మీద ఎవరయినా కథ రాసుకోవచ్చు. అందరికీ హక్కులు వుంటాయి. పురాణాలు, జానపద గీతాలు ఎవరి స్వంతం? అందుకే అంటారు. కాపీ రైట్ ఐడియాకి వుండదని. ఒక ఆలోచన ఎవరికయినా రావచ్చు''.

''ఈ సమస్యకి పరిష్కారం వుందా?''

''ప్రతి సమస్యకి పరిష్కారం వుంటుంది. అది చెప్పే దెవరు? మాకు ఓ యూనియన్ వుంది. అందులో కంప్లయింట్ చేయాలి. అంతే గాని ఛానల్స్ కి ఎక్క కూడదు. ఇది రాసుకున్నారు. ఇప్పుడు సినిమా వాళ్లు కల్పించుకోవాలి. అంటే ఏం చేస్తారో పక్కన వుంచుదాం. నేను కొన్ని ఉదాహరణలు చెబుతాను. ఇవేవీ యూనియన్ పరిధి దాటవు. నేను ఎవరి మీదా ఆరోపణలు చేయటం లేదు. చేయను. మీరు అడిగే వాటికి వివరణ మాత్రం ఇస్తాను''.

''అసలు కాపీ అంటూ వుండదా?'' యాంకర్ అడిగింది.

"అది లేకపోతే ఇన్ని గొడవలు రావు. ప్రకృతి విలయాలు, ఫ్యాక్షన్, ప్రేమ, ఇలాంటి వాటితో కొన్ని వందల సినిమాలు వస్తుంటాయి. అది కమర్షియల్ పాయింట్ గా చూడాలి. అన్నీ ఒకే రకంగా వుంటాయి. అలాగే కథను నడపటానికి ట్విస్టులుంటాయి. నీ కథలో కొత్త పాయింట్ ఏంటి? అది చౌర్యానికి గురయిందా అని కోర్టులు తేలుస్తాయి".

"ఎప్పటికి? ఎన్ని దశాబ్దాలకి".

"అది ఎవరు చెప్పాలి. సివిల్ కేసులున్నాయి. తరాలు మారిన సందర్భాలు వున్నాయి. ఇదేదో సినిమా వారి కోసం ఆలస్యం చేయటం కాదు. ఒకటి మాత్రం నిజం. ప్రతి రచయితా భిన్నమైన వారే. మనం ఒకే విషయం గురించి రాసినా, అందులో ఎవరి దృష్టి వారిది. ఎవరి శైలి వారిది. అవి రెండూ ఒకే రకంగా వుంటే అది కాపీ అవుతుంది".

"అదెలా జరుగుతుంది?"

"అది రుజువు చేసుకోవాలి ఆరోపించిన వారు. దానికి గురయిన వారు కూడా సమాధానం ఇవ్వాలి. ఫైనల్ గా ఒకటి చెబుతున్నాను. ఎవరి అంతరాత్మకి వారికి తెలుసు. ఇది నా కడుపులో పుట్టిందా? ఇంకొకరి సృజనని దొంగ తనం చేశామా అని. మనుషులు గెలుస్తారు ఓడతారు. అయితే ఏదొక రోజు దీనికి ప్రతిఫలం అనుభవిస్తారు".

వెంకటాద్రి టీ.వీ.ని ఆఫ్ చేశాడు.

అప్పుడు ఫోన్ రింగ్ అయింది. నిరంజన్ నుండి. తను రేపు వస్తున్నాను అని చెప్పాడు. అన్నీ ఫైనలైజ్ చేద్దాం అన్నాడు. తర్వాత శివకృష్ణ నుండి ఫోన్.

"ఎప్పుడు వస్తున్నావు వెంకటాద్రి?" అన్నాడు.

"ఎల్లుండి అనుకుంటున్నాను"

"ఏం లేదు. ఓ ముఖ్యమైన సంఘటన జరిగింది. అది నీకు చాలా ఇష్టమైన విషయం. నువ్వు వచ్చాక మనం మాట్లాడుకుందాం. సస్పెన్స్. అది ప్రేమా మరొకటా అనవద్దు. అవన్నీ ఫోన్ లో మాట్లాడుకునేవి కాదు. ఉంటాను" అని ఫోన్ కట్ చేశాడు.

ఫోన్ లో మాట్లాడుకునేవి కాదంటే అదేదో సీరియస్ మేటర్ అయి వుండాలి. అంటే ఈ దేశంలో సామాన్యుల ఫోన్లు కూడా ట్రాప్ చేయవచ్చు అని అనుమానమా–ఏదన్నా నేరం జరిగినప్పుడు అలాంటివన్నీ బయటకు తీస్తారని ముందు జాగ్రత్తా అనుకున్నాడు. అదేంటో ఎంత సాంకేతిక మార్పు వస్తే అంతగా స్వేచ్ఛ హరించుకుపోతోంది. ఇప్పుడ ఏదీ రహస్యం కాదు అనుకున్నాడు.

మళ్లీ టీ.వీ. ఆన్ చేయాలనిపించలేదు. ఇంతకు ముందు జరిగిన సినిమా గొడవ–ఏది ఎవరి స్వంతం అనేది. నిజానికి రచనలయినా, కథలయినా ఎవరి స్వంతం! అందరూ ప్రకృతి గురించో, మనుషుల గురించో రాస్తారు. అలాగే సంగీతం, ఫోటోగ్రఫి. అవి నా స్వంతం అనుకుంటారు గాని, ప్రకృతి గాని, మనుషులు గాని ఛార్జ్ చేయటం లేదు కదా అనుకున్నాడు.

అలాగే ఎవరికి వారు అంతరాత్మ అంటారు. అది ముందు అనవచ్చు. చివర్లో అనవచ్చు.

చివరకి అనుభవిస్తారు అని శాపనార్థం. అదే జరిగితే ఈ ప్రపంచం ఇలా ఎందుకు వుంటుంది. ఇప్పుడు జనంలో భక్తి పెరిగిపోయింది అంటున్నారు గాని పాప భీతి లేకుండా పోయింది. ఇది వాస్తవం.

ఇప్పుడు భూమి వుంది. ఒకప్పుడు అది అందరిదీ. ఇప్పటికీ ఖాళీగా వున్న భూములు ప్రభుత్వానికి చెందుతాయి. కొంతమంది వాటిని ఆక్రమించుకుంటారు. అదో కథ. ఏమయినా మనం ఓ వస్తువును కొన్న తర్వాత అది మన స్వంతం అవుతుంది. ఇప్పుడు ఆ రోజు బ్యాగ్ తనకు దొరికింది. అప్పటి దాకా అది ఎవరిదో. దాని పక్క నుండి చూడకుండా తను నడిచి వెళ్తే ఇంకొకరికి కనిపించేది. అది వారి స్వంతం అయ్యేది.

అలాగే రోడ్డు పక్కన పూల చెట్లు వుంటాయి. పండ్ల చెట్లు వుంటాయి. వాటిని ఎవరయినా కోసుకోవచ్చు. వాటిని కొంతమంది పాడుకుంటారు. అప్పుడు కూడా వాటిని కాపాడుకోవాలి. కథలయినా, ఆస్తులయినా అంతే. మొత్తం ఆ గొడవలో వెంకటాద్రికి నచ్చింది ఒకటుంది. తను నిరూపించాలి అన్నాడు. అవును. ఇది నా స్వంతం అని నిరూపించగలగాలి. అప్పుడు దాని మీద హక్కులుంటాయి. ఇప్పుడు ఈ ఏభై లక్షల విషయంలో అలాంటిది జరిగితే, కనీసం వాళ్లు ఏ పోలీస్ స్టేషన్ లోనో రిపోర్ట్ యిచ్చి వుంటే అది వేరే విషయం. అలాంటిది లేనప్పుడు ఉపయోగించుకోవటమే.

అదేంటో బతుకు ఒక్కోసారి భలే చిత్రంగా అనిపిస్తుంది. ఒక్కోసారి సంఘటనలు అలా జరిగిపోతుంటాయి. అన్నీ ఒక దానితో ఒకటి సంబంధం వున్నట్లుంటాయి. కష్టాలూ, సుఖాలూ కూడా ఓ వెల్లువలా వచ్చి పడుతుంటాయి.

తన దగ్గర ఏభై వేల పాత రూపాయల నోట్లు వున్నాయి.

ఇప్పుడు వాటిని మార్చి కొత్తవి ఇవ్వమంటే ఇస్తారా!

సమయం అయిపోయాక పరీక్షని రాయనిస్తారా? ఓ సంవత్సరం వృధా అవ్వాల్సిందే. తప్పులు జరుగుతాయి. దాని వెనకాల అనేక కారణాలు. అవన్నీ మనుషులకి, ప్రభుత్వాలకి అనవసరం. ఎవరి తప్పుకు వారు అనుభవించాలి. శాపనార్థాలకి చెంది ఇదీ ఓ కోణమే! వెంకటాద్రి నిద్రకుపక్రమించాడు.

శివకృష్ణ వెంకటాద్రిని తమ ఇంటికి ఆహ్వానించాడు. ఇద్దరూ అతని గదిలో కూర్చున్నారు. అతని శ్రీమతి లేదు. ఇంట్లో ఎలాంటి శబ్దం లేదు. వాకింగ్ ఈ రోజు మానేద్దాం అన్నాడు శివ. వెంకటాద్రికి ఉత్కంఠగా వుంది.

''నాకు చిన్ననాటి స్నేహితుడు ఈ మధ్య కలిశాడు వెంకటాద్రి. ఆ రాత్రి సడన్ గా వచ్చాడు. తను ఓ సూట్ కేసు నాకు యిచ్చాడు. ఇది నీ దగ్గర వుంచు. తర్వాత తీసుకుంటాను అన్నాడు''.

''అందులో ఏముంది?''

''నీకు అలాంటి అనుభవం ఎదురయితే ఆ ప్రశ్న నీ ఫ్రెండ్ ని అడుగుతావా?'' అన్నాడు శివ. అతను మాట్లాడలేకపోయాడు.

''అది వాడు చెప్పాలి. అందులో డాక్యుమెంట్స్ వుండవచ్చు. అవి అతని ఆస్తులకి చెందినవి కావచ్చు. ఇంకేమయినా కావచ్చు. నేను అందులో డబ్బు వుంటుందని అనుకోను. లాక్ చేసి వుంది. కోడ్ నెంబర్స్ కి చెందిన లాక్ అది. చాలా కాలం తర్వాత కలిశాం. అది ఇంట్లో వుంచాలా వద్దా అన్న సంశయం వచ్చింది. నా ముఖంలో ఫీలింగ్స్ ని వాడు గమనిస్తున్నాడని ఇంకో బాధ''.

ఇద్దరూ నవ్వుకున్నారు.

''అతను బాగా సంపాదించాడు. ఇదిగో ఈ సంపాదన ఓ దశ దాటనంత వరకు బాగా వుంటుంది. అక్కడ నుండి సమస్యలు మొదలు''.

''ఇంతకీ నువ్వు ఏం చేశావో చెప్పు''.

''నీ దగ్గర కొన్ని విషయాలు ఓపెన్ గా మాట్లాడగలను. ఒక్క నిముషం'' అని లేచి వెళ్లాడు. వెంకటాద్రిలో అదే ఉత్కంఠ. అయిదు నిముషాల తర్వాత వచ్చాడు. చాలా అందంగా వుంది. అది బ్రీఫ్ కేస్ కాదు. అలా అని పెద్ద సైజుది కాదు. ఖరీదు ఎక్కువ గానే వుంటుంది అనిపిస్తోంది.

''బాగుంది'' అన్నాడు వెంకటాద్రి.

''అందుకే ఇలాంటి సూట్ కేసులో కొన్ని కోట్లకు చెందినవి వుంటాయి వివరాలు. తన దగ్గర సేఫ్ కాదు అనుకున్నాడు. ఇలాంటివి లాకర్లలో పెట్టినా తాత్కాలికమే. అతన్ని పట్టుకుంటే అన్ని లాకర్లూ దగ్గరుండి తెరిపిస్తారు. నీకు తెలుసుకదా!''

''అవును. అయినా ఇన్ కమ్ టాక్స్ వారు దాడి చేయబోయే ముందు అన్ని వివరాలు సేకరిస్తారు. మిత్రులెవరూ, బంధువులు ఎవరూ అని. అందుకే ఏకకాలంలో అన్ని చోట్ల దాడులు జరుగుతుంటాయి''.

''అందుకే చాలా సంవత్సరాల తర్వాత కలిశాం. అప్పుడు తనకి ఐడియా వచ్చి వుంటుంది. నేను ఒప్పుకుంటానా లేదా అని డౌట్ వచ్చిందా అనేది చెప్పలేను. ఇందులో ఏముంది అనేది ఇప్పటికీ సందేహమే''.

''ఇది ఎప్పుడు తీసుకెళ్తారు?''

''మనకు తెలియదు''.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS